
సాక్షి వికారాబాద్

శనివారం । 13 । మే । 2023



'కోట్‌పల్లి' నీరు వృథా

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టు బేబి కెనాల్ తూము నుంచి నీరు వృథాగా పోతోంది. 10లో▸



ఆస్పత్రులు ఆహ్లాదకరంగా..

ప్రభుత్వ ఆస్పత్రులన్నీ ఆహ్లాదకరంగా ఉండాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి జీవారాజ్ సిబ్బందికి సూచించారు. 10లో▸



శ్రద్ధ పెట్టారు.. సాధించారు

కొడంగల్ శివారులోని గురుకుల విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. 11లో▸

న్యూస్‌రీల్

పొలం విషయమై ఘర్షణ

ఎనిమిది మందిపై కేసు

కుల్కచర్ల: పొలం విషయమై జరిగిన ఘర్షణ ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ సత్యశీలారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దోమ మండలం కొత్తపల్లికి చెందిన చిన్న సత్తయ్యకు కుల్కచర్ల మండలం చెల్లాపూర్ పరిధిలో సర్వే నంబరు 146లో 8 ఎకరాల 30గుంటల పొలం ఉంది. గురువారం సాయంత్రం చెల్లాపూర్‌కు చెందిన కొందరు ఆ పొలాన్ని దున్నుతున్నారు. విషయం తెలుసుకున్న సత్తయ్య వచ్చి అడ్డుకున్నారు. దీంతో చెల్లాపూర్‌కు చెందిన రవి, శ్రీను, బాబు, కృష్ణయ్య, కేశవులు, శ్రీహరి, గణేశ్, శేఖర్‌లు కర్రలతో దాడికి పాల్పడగా సత్తయ్యకు గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు శుక్రవారం వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అనంతగిరి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శీను తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో పదహారేళ్ల బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే ఏరియాకు చెందిన నరేష్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో కార్బైడ్ ఉపయోగించి మగ్గిస్తున్న మామిడి పళ్ల దుకాణాలపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ మేరకు సదరు వ్యాపారస్తులు వినియోగిస్తున్న కార్బైడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

తాండూరు టౌన్: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి యువకులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెద్దేముల్ మార్గంలో టీపాయింట్ వద్ద ఇద్దరు యువకులు బెట్టింగుకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. అగ్గనూర్‌కు చెందిన మెకానిక్ షేక్ సైఫాన్‌తో పాటు చెంగోల్‌కు చెందిన దినేష్ అనే విద్యార్థిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరిద్దరూ కొంత కాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు వారి మొబైల్ పరిశీలనలో తేలిందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

కార్మికుల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

హయత్‌నగర్: అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు న్యాయవ్యవస్థ దోహదపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్ వార్డు కార్యాలయం వద్ద శుక్రవారం ఆమె అసంఘటిత కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులకు చట్టం ఎన్నో హక్కులను కల్పిస్తోందన్నారు. వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని, న్యాయ సంబంధమైన సమస్యలను న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు తప్పనిసరి గుర్తింపు కార్డులు, బీమా కార్డులను పొందాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామ్మోహన్, బాల్‌రెడ్డి, పారా లీగల్ వలంటీర్లు మాడ్గుల అనురాధ తదితరులు పాల్గొన్నారు.


నీటిమట్టం తెలుసుకోవడం ఇక సులువే



కోట్‌పల్లి ప్రాజెక్టు కట్టపై ఏర్పాటు చేసిన సెన్సార్ యంత్రం

- కోట్‌పల్లి ప్రాజెక్టు కట్టపై ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్ ఏర్పాటు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు బేబికెనాల్ వద్ద ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ను ఏర్పాటు చేశారు. సెన్సార్ల సహాయంతో ప్రాజెక్టులో ఎంత నీరుంది? ఉండాల్సిన నీరెంత? ఇంకా ఎంతనీరు రావాలి? అనేవి ఈ రికార్డర్ స్పష్టంగా చూపిస్తుంది. కార్యాలయంలో కూర్చునే ప్రాజెక్టులోని నీటిని అంచనా వేయవచ్చు. ఏడబ్ల్యూఎల్ఆర్ అనే ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌కు ఓ యాప్‌ను అనుసంధానం చేసి నీటిని తెలుసుకునేందుకు వీలుంది. ఇన్నాళ్లు మ్యాన్‌వల్ పద్ధతిలో గ్యాంగ్‌మెన్లు ప్రాజెక్టు వద్దకు వెళ్లి చూసేవారు. భారీవర్షాలు వచ్చినా, వాగులు ఉప్పొంగుతున్నా ప్రాజెక్టు వద్దకు చేరుకునేందుకు ఇబ్బందులు ఏర్పడేవి. దీంతో ప్రాజెక్టులో ఎంతమేర నీరుందో తెలిసేది కాదు. సిమెంట్ దిమ్మెలతో నిర్మించిన వాటర్ లెవల్ పాయింట్ వద్ద నీరు ఎంత ఉందో గ్యాంగ్‌మెన్లు చెప్పేవారు. కట్టపై ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డర్‌ను ప్రాజెక్టుకు వచ్చే ప్రతి ఒక్కరూ చూసి వెళ్తుండటం విశేషం.



కట్ట కింది భాగంలో వాటర్ లెవల్ రికార్డర్ ఏర్పాటు

లక్ష్యం: 5.90 లక్షల ఎకరాలు

వ్యవసాయ శాఖ వానాకాలం సాగుకు కసరత్తు ప్రారంభించింది. 5.90 లక్షల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక రూపొందించింది. అందుకు క్షేత్ర స్థాయి, అనుబంధ శాఖల అధికారులతోనూ సమావేశం నిర్వహించింది. ఇదే సమయంలో క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన కార్యక్రమాలు సమీక్షించా. ఈ సీజన్‌లో ఏయే పంటల విస్తీర్ణం పెంచాలి, ఏ పంటలు తగ్గించాలి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలనే విషయాలపై చర్చించారు.

వానాకాలం సాగుకు సర్వం సిద్ధం

- 2.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకు ప్రణాళిక
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- ఈసారి రైతు చైతన్యయాత్రలు లేనట్లే!
- దొంగచాటుగా నిషేధిత విత్తనాల విక్రయాలు



జిల్లాలో క్యారెట్ పంట సాగు

వికారాబాద్: డివిజన్లు, మండలాల వారీగా అందుబాటులో ఉంచాల్సిన ఎరువులు తదితర అంశాలపై ఇప్పటినుంచే ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, కొనుగోలు, అందుబాటులో ఎరువులు, తదితర వివరాలు తెలియజేసే రైతు చైతన్య యాత్రలు ఉంటాయా? ఉండవా అనే విషయమై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టతలేదు. రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ.. ప్రభుత్వం చెబుతున్న అదనపు పనుల్లో నిమగ్నమైంది. జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు తదితర అంశాలను పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. కొందరు వ్యాపారులు ఇప్పటి నుంచే బీటీ-3 పత్తి విత్తనాలను గుట్టుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తుండటం గమనార్హం.

ప్రధానంగా పత్తి..

ఈ సీజన్‌లో సుమారు 5.90 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయా పంటలు సాగుచేయవచ్చని అధికారులు అంచనావేశారు. జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి గతేడాది 2.40 లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 2.70 లక్షల ఎకరాలకు పెంచేలా ఆ శాఖ ప్లాన్ చేస్తోంది. కందులు 1.31 లక్షల ఎకరాలు, వరి 1.34 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 59వేల ఎకరాలు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. వరి, మొక్కజొన్న, జీలుగు, జనుము, సోయాబీన్, కందులు విత్తనాలను సమయానికి అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జిల్లాలో అధిక విస్తీర్ణంలో పండించే పత్తి విత్తనాలు లైసెన్సు కలిగిన ఫెర్టిలైజర్ అండ్ సీడ్స్ దుకాణాలలో అవసరమైన మేరకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఎరువులు, విత్తనాలు ఎంత అవసరమవుతాయనే విషయంలో ఆ శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. డీఏపీ, యూరియా, కాంప్లెక్స్, పోటాష్, సూపర్ ఫాస్ఫేట్ ఎంతెంత అవసరమవుతాయనే విషయంలో అంచనాలు రూపొందిస్తున్నారు.

దొంగచాటుగా నిషేధిత పత్తి విత్తనాలు

ప్రభుత్వ నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలు దొంగచాటుగా కొందరు వ్యాపారులు రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విత్తనాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. గ్లైసిల్ పత్తి సాగుచేయకూడదని ఇప్పటికే కేంద్ర పర్యావరణ, అటవీశాఖల ఆధ్వర్యంలో పనిచేసే జెనెటిక్ అప్రూవల్ ఇంజనీరింగ్ కమిటీ (జీఈఏసీ) హెచ్చరించింది. అయినప్పటికీ కూలీల కొరత, కలుపు అధికం కావడంతో ఈ విత్తనాల పట్ల రైతులు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. ఇదే అదనుగా కొందరు దళారులు, వ్యాపారులు ఈ విత్తనాలు తమకు నమ్మకమైన వారికి రహస్యంగా విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు వినికిడి.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



వానాకాలం సీజన్‌లో పంటలవారీగా ఏయే విత్తనాలు, ఎరువులు ఎన్ని అవసరమో అన్ని అందుబాటులో ఉంచుతాం. నకిలీ విత్తనాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్ కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. నకిలీ విత్తనాలనేవి మా దృష్టికి రాలేదు. బీటీ-3 గ్లైసిల్ పత్తి విత్తనాలను కొనవద్దు. వాటి వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

నెలాఖరులోగా పూర్తిచేయండి

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై అశ్రద్ధ తగదు
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టిన పనులపై అశ్రద్ధ తగదని, ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి కొత్త రోడ్లు, చెరువుల కింద కాల్వల నిర్మాణ పనులు, బృహత్ పల్లె ప్రకృతివనాలు, మినీ వనాల పనుల పురోగతిపై తహసీల్దార్, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్‌లతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిన పనులను లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ కాల్వల పనులను వానాకాలానికి ముందే ముగించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు కొన్ని మండలాల్లో బృహత్ పల్లె వనాలు, మినీ పీపీవీలకు అవసరమైన స్థలాలు కేటాయించబడలేదని, వచ్చే హరితహారంలో మొక్కలు నాటేందుకు అణువైన స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు సంయుక్తంగా వెళ్లి స్థలాలను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ కృష్ణన్, ఇరిగేషన్ ఈఈ, డీఈలు, ఏఈలు, తహసీల్దార్‌లు, ఏపీవోలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణం

- 'పది' ఉత్తీర్ణత తగ్గడంపై కలెక్టర్‌కు ప్రజాసంఘాల వినతిపత్రం

పరిగి: విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో పది ఫలితాలు తగ్గాయని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. విద్యాశాఖ బాధ్యత వహించాలని శుక్రవారం వైఎస్సార్‌టీపీ, సీపీఐ ఎంఎల్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధుల్లో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులకు చదువులు చెప్పాల్సింది పోయి వ్యాపారాలపై ఎక్కువ సమయం కేటాయిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులందరూ తమ పిల్లలని ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తూ నిరుపేద విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల పిల్లలు సైతం ప్రభుత్వ బడుల్లో చదివితే అప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల తీరుతో విద్యావ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. మెరుగుపరిచేందుకు ఇప్పటికైనా చర్యలు తీసు కోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోళ్ల యాదయ్య, సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి మల్లేశ్, జాకబ్, బసిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

భరోసా సెంటర్ల పనితీరు భేష్



మహిళా పీఎస్‌ను సందర్శించిన మహారాష్ట్ర ఐజీపీ దీపక్ శివానంద్ పాండే

- మహారాష్ట్ర ఐజీపీ దీపక్ శివానంద్ పాండే
- ఉమెన్ పీఎస్, షీటీం, హెల్ప్‌డెస్క్‌లను ఆదర్శంగా తీసుకుంటాం

అనంతగిరి: జిల్లాలో ఉమెన్ పోలీస్ స్టేషన్, భరోసా సెంటర్లు అద్భుతంగా పనిచేస్తున్నాయని మహారాష్ట్ర ఐజీపీ దీపక్ శివానంద్ పాండే అన్నారు. ఈ మేరకు శుక్రవారం మహిళలు, బాల బాలికల సంరక్షణపై జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ కార్యాలయానికి వచ్చి భరోసా సెంటర్, ఉమెన్ పీఎస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, బాల బాలికలు, బాధితులు పట్ల తీసుకుంటున్న చర్యలు భేష్ అన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో అందరూ బాగా పనిచేస్తున్నారన్నారు. ఉమెన్ పీఎస్‌లో హెల్ప్‌డెస్క్, భరోసా సెంటర్‌లో తీసుకుంటున్న జాగ్రత్తలు, మహిళలపైన నేరాల నివారణ చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. షీటీం పనితీరు బాగుందన్నారు. ఉమెన్ పీఎస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. ఉమెన్ పీఎస్, షీటీం, 100 డయల్, ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లు తదితర వాటిని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి జిల్లాలో మహిళలు, బాలబాలికల సంరక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి ఐజీపీకి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, ఉమెన్ పీఎస్ సీఐ ప్రమీల, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత కలకలం

- బ్రాహ్మణపల్లి శివారులో సంచరిస్తున్నట్లు వీడియో వైరల్
- ఆయా ప్రాంతాలను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లి శివారు హిమసాయి ఫేజ్-3, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో చిరుత కలకలం రేపింది. చిరుత సంచరిస్తున్న వీడియో ఆలస్యంగా బయటికి రావడంతోపాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో శుక్రవారం అటవీ శాఖ అధికారుల బృందం వీడియోలో ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎనిమల్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి ఆనవాళ్లు కనుక్కుంటామని పేర్కొన్నారు. వీడియోలో చెట్ల ఆకులు ఎండిపోయినట్లుగా కనిపిస్తుండగా ప్రస్తుతం ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మొత్తం పచ్చగా ఉన్నాయి. దీని బట్టి ఈ వీడియో సుమారు 20 రోజుల క్రితంనాటిది అయి ఉంటుందని భావిస్తున్నారు. పచ్చని చెట్లతో ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో చాలామంది వాకింగ్ చేస్తుంటారు. అలా వాకింగ్ చేస్తున్న వ్యక్తులు తీసిన వీడియో అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ వీడియోలో కనిపిస్తున్నది చిరుత లేదా హైనా అయి ఉండొచ్చని, ఆధారాలు దొరికాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. రైతులు, వాకింగ్‌కు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

జాతీయ రహదారి పనుల్లో వేగం

- ఫ్లైఓవర్ నిర్మాణానికి భూ పరీక్షలు
- భూ సేకరణకు రూ.150 కోట్లు

కొడంగల్: మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో వేగం పుంజుకుంది. రెండు నెలల క్రితం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. మహబూబ్‌నగర్ నుంచి కొడంగల్ వైపు వచ్చే మార్గంలో ఒకవైపు మట్టిపోసి లేవల్ చేస్తున్నారు. రహదారి నిర్మాణ పనులను రెండు బిట్లుగా విభజించారు. మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ నుంచి బొంరాస్‌పేట మండలం దుద్యాల వరకు ఒక బిట్టు, దుద్యాల నుంచి కర్ణాటక రాష్ట్రం మన్నాకెళ్లి వరకు రెండో బిట్టుగా విభజన చేశారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం కాంట్రాక్టు పొందిన ఎస్‌ఆర్‌ఆర్‌సీ కంపెనీ బిట్ల వారీగా పనులను విభజించి ఇతరులకు అప్పగించారు. నిర్దేశిత సమయంలోపు పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో పనుల్లో వేగం పెంచారు. ప్రస్తుతం కొడంగల్ శివారులో ఫ్లై ఓవర్ నిర్మించడానికి భూ పరీక్షలు చేస్తున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తట్టుకొనే శక్తి ఇక్కడి భూమికి ఉందో లేదోనని పరీక్షలు చేశారు.

త్వరలో ఫ్లై ఓవర్ నిర్మాణం

మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొడంగల్ శివారు నుంచి బైపాస్ నిర్మిస్తారు. ఈ బైపాస్ మరో జాతీయ రహదారి అయిన బీజాపూర్ – హైదరాబాద్ రోడ్డును క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు జాతీయ రహదారులు కలిసే చోట ఫ్లై ఓవర్ నిర్మించాలని జాతీయ ఉపరితల రహదారుల అధికారులు నిర్ణయించారు. ఫ్లై ఓవర్ నిర్మించే ప్రాంతంలో 150 ఫీట్ల రోడ్డు నిర్మిస్తారు. ఫ్లైవర్‌తో పాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. ఫ్లైఓవర్‌ను హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి పై నిర్మిస్తారు. డీపీఆర్‌లో సూచించిన అలైన్‌మెంట్ ప్రకారం కొడంగల్‌లో నాలుగు కిలోమీటర్ల దూరం బైపాస్ నిర్మిస్తారు. భూ సేకరణ కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



జాతీయ రహదారిగా మారనున్న రోడ్డు

రోడ్డు నిర్మాణానికి రూ. 630 కోట్లు

మహబూబ్‌నగర్ – చించోలీ (ఎమ్‌సీ) అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చారు. ఈ రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.630 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కర్నాటక రాష్ట్రం చించోలి, మన్నాకెళ్లి వరకు జాతీయ రహదారి నిర్మిస్తారు. ఈ రహదారికి 167ఎన్ గా నామకరణం చేశారు.

ఓటరు లిస్టుల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయకుమారి

- ఆర్డీఓ విజయకుమారి

అనంతగిరి: ఎన్నికలకు సంబంధించిన సన్నాహాక పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ విజయకుమారి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన అధికారులు, పార్టీల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు. ఓటరు లిస్టుల పరిశీలన క్షుణ్ణంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేయాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకోని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు చేర్చడం, మార్పులు చేర్పులు చేయడం విషయంలో సిబ్బందికి సహకరించాలని, ఏమైనా సూచనలు సలహాలు ఉంటే సూచించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిందితుడికి రిమాండ్

పూడూర్: బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన చన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని మాటుగూడెం గ్రామానికి చెందిన నవీన్ అదే గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేశారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే యాదయ్య



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబ్‌పేట్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ముఖ్యంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.60 వేల చెక్కును కుమార్‌కు, జహంగీర్‌కు రూ.38 వేల చెక్కును పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ మానస, ఏఈ లక్ష్మయ్య, మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చేవెళ్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ హయ్యూమ్ తెలిపిన వివరాలు.. చేవెళ్లకు చెందిన టీ వెంకటప్ప(45) గ్రామ పరిధిలోని షాబాద్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా షాబాద్ వైపు నుంచి చేవెళ్లకు వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ కారు వదిలి పారిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య పక్కీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు బేబి కెనాల్ తూము నుంచి వృథాగా పోతున్న నీరు

‘కోట్‌పల్లి’ నీరు వృథా

- జనవరి నుంచి దిగువకు నీరు
- ప్రాజెక్టు నీరు కాగ్నా నది పాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- పైకి లేపిన తూము కిందకు దిగని వైనం
- ప్రాజెక్టులో తగ్గుతున్న నీటి మట్టం
- వారం రోజుల్లో మరమ్మతులు: ఏఈ నవీన్

ధారూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి మధ్య తరహా ప్రాజెక్టు బేబి కెనాల్ తూము నుంచి నీరు వృథాగా పోతోంది. జనవరి నెల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇనాళ్లు పంటలకు నీరు అవసరం ఉన్నందున ఎవరూ నీటి వృథాను ప్రశ్నించలేదు. ప్రస్తుతం వరి కోతకు రావడం, పంటలకు నీటి అవసరం లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా నీరు వృథాగా వెళితే ఖరీఫ్ సాగుకు నీటి ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు పేర్కొన్నారు. ప్రాజెక్టు నీటి వృథాపై జనవరి 21న సాక్షి దినపత్రికలో కథనం రావడంతో తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్న అధికారులు మళ్లీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

అధికారుల నిర్లక్ష్యం

కోట్‌పల్లి ప్రాజెక్టు విషయంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీటి వృథాపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఎడమ కాలువ షట్టర్‌కు మరమ్మతులు చేయించడం లేదు. దీంతో నీరు వృథాగా పోయి ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గి పోయింది. వెంటనే మరమ్మతులు చేయించాలి.
– ఆయకట్టు రైతులు

వారం రోజుల్లో మరమ్మతులు

కోట్‌పల్లి బేబీ కెనాల్ తూము షట్టర్ దెబ్బతింది. మరమ్మతులు చేయించేందుకు మెకానిక్‌ని పిలిపించాం. కానీ ఫలితం లేకపోయింది. కొత్తగా రాడ్, షట్టర్ వేయించాల్సి ఉంటుందని మెకానిక్‌లు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఆదేశాలు రాగానే పనులు చేయిస్తాం. వారం రోజుల్లో తూముకు మరమ్మతులు చేయిస్తాం.
– నవీన్, ఏఈ

ఆస్పత్రులు ఆహ్లాదకరంగా ఉండాలి

- నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం
- డిప్యూటీ జిల్లా వైద్యాధికారి జీవారాజ్

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్పత్రులన్నీ ఆహ్లాదకరంగా ఉండాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి జీవారాజ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందేలా చూడడంతోపాటు ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వ్యాధులపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సదుపాయాలను వారికి వివరించాలన్నారు. ఆస్పత్రుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌క్వాష్ జిల్లా మేనేజర్ అనురాధతో కలిసి ఆస్పత్రిలో చేయాల్సిన మార్పులు, చేర్పుల గురించి సూచనలు చేశారు. కుల్కచర్ల ఆస్పత్రికి ఎన్‌క్వాష్ గుర్తింపు పొందేందుకు అర్హతలను పరిశీలించేందుకు రాష్ట్ర ఎంపిక కమిటీ ఈ నెల 24, 25 తేదీల్లో ఇక్కడ పర్యటించనున్నట్లు వారు తెలిపారు.

నర్సుల దినోత్సవం

ఆస్పత్రిలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్య వ్యవస్థలో నర్సుల సేవలు అమూల్యమైనవని పేర్కొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాజుద్దీన్, సీహెచ్‌ఓ చంద్ర ప్రకాష్, వైద్యురాలు ప్రశాంతి, సిబ్బంది యాదమ్మ, విజయలక్ష్మి, పాతిమా, భాగ్యలక్ష్మి, సాజన్ బేగం, మల్లేష్, నవీన్, సుజాత, రత్నమ్మ, వెంకటమ్మ, సుజాత, మంగమ్మ, శ్రీలత, భారతమ్మ, మైభమ్మ, జంగమ్మ, సిరాజ్, ప్రశాంత్, రఫీ, శ్రీనివాస్, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



నర్సులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఇంటి పైకప్పు కూలి వ్యక్తి మృతి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ఇంటి పైకప్పు కూలి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వికారాబాద్‌కు చెందిన పీ రాధాకిషన్(60) పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాత్రి 11 గంటల సమయంలో కుమారుడు రాజ్‌కుమార్‌తో కలసి రాధాకిషన్ భోజనం చేశాడు. అనంతరం రాజ్‌కుమార్ ఇంటి బయటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో నుంచి పెద్ద శబ్దం వచ్చింది. వెళ్లి చూడగా ఇంటి పైకప్పు పడిపోయింది. చుట్టుపక్కల వారు పైకప్పు తొలగించి తీవ్రంగా గాయపడిన రాధాకిషన్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో చనిపోయాడు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతురెడ్డి, జగన్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ముచ్చటగా మూడో నేత

- వైస్ ఎంపీపీగా శ్రావణ్‌కుమార్
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీలు

బొంరాస్‌పేట: ఒప్పందం ప్రకారం మండల ఉపాధ్యక్ష పదవికి ముచ్చటగా మూడో నేత ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రిసైడింగ్ అధికారి తరుణ్ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ ఎన్నిక జరిగింది. బొంరాస్‌పేట ఎంపీటీసీ సభ్యుడు శ్రావణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి బొంరాస్‌పేట మండల వైస్ ఎంపీపీ పదవికి ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశపు మందిరంలో జరిగిన ఎన్నికలో 15మంది ఎంపీటీసీలకు గాను 11మంది హాజరయ్యారు. ఎంపీటీసీలు ఉన్న మాజీ వైస్ ఎంపీపీలు బీ సుదర్శన్‌రెడ్డి, సీ శేరి నారాయణరెడ్డి, అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొత్తూరు, చిల్మల్ మైలారం ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ప్రిసైడింగ్ అధికారి ముందుగా నియమాలను వివరించారు. తుంకిమెట్ల తిరుపతయ్య, రేగడి మైలారం జగదీశ్వరయ్యలు వైస్ ఎంపీపీ పదవికి శ్రావణ్‌కుమార్‌ను ప్రతిపాదించారు. ప్రతిపాదనను అందరు చేతులెత్తి అంగీకరించడంతో శ్రావణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమిబాయి, ఎంపీడీఓ పాండు నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు మైనొద్దీన్ పాల్గొన్నారు.



శ్రావణ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి

బీఆర్‌ఎస్ నాయకుల సన్మానం

వైస్ ఎంపీపీగా ఎన్నికైన శ్రావణ్‌కుమార్‌ను కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధు యాదవ్, రమణారెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

గుండెవాపు వ్యాధితో పశువుల మృత్యువాత

- నాలుగు రోజుల్లో ఆరు జీవాల మృతి
- టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచన

కొడంగల్ రూరల్: మండలంలోని హుస్సేన్‌పూర్‌లో గుండెవాపు వ్యాధితో పశువులు మృత్యువాత పడుతున్నాయి. నాలుగు రోజుల్లో ఆరు జీవాలు చనిపోయాయి. గ్రామానికి చెందిన పీ చంద్రయ్యకు చెందిన ఒక బర్రె, రెండు దూడలు, అంజిల్‌రెడ్డికి చెందిన ఒక బర్రె, ఒక దూడ, రవికి చెందిన ఒక దూడ చనిపోయాయి. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారులు శుక్రవారం గ్రామానికి వెళ్లి జీవాలకు టీకాలు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నిండిన నీటిని తాగడంతో వైరల్ సోకి పశువులు మృత్యువాత పడ్డాయని వైద్యులు తెలిపారు. హస్నాబాద్ పశు వైద్యాధికారి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. గుండె వాపు వ్యాధి బారిన పడిన పశువులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులకు గురై మృత్యువాత పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో రావులపల్లి పశువైద్యాధికారి పరమేష్, ఎరన్‌పల్లి జేవీఓ వెంకటయ్య, గోపాలమిత్ర రఘు తదితరులు పాల్గొన్నారు.



హుస్సేన్‌పూర్‌లో లేగ దూడకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

కుందేళ్ల వేటకు వెళ్లి..

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

దోమ: కుందేళ్ల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి.. అడవి పందుల బారి నుంచి మొక్కజొన్న పంటను రక్షించుకునేందుకు రైతు ఏర్పాటు చేసిన విద్యుత్ ఫెన్సింగ్‌ను తాకి మృత్యువాత పడ్డాడు. ఆ సంఘటన దోమ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాకొండ గ్రామానికి చెందిన పీ చంద్రయ్య(34) తన స్నేహితులతో కలిసి గురువారం రాత్రి కుందేళ్ల వేటకు వెళ్లాడు. అయితే దోమ గ్రామానికి చెందిన జీ మల్లేశం తన పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. గురువారం రాత్రి కుందేళ్లను వేటాడే క్రమంలో ఫెన్సింగ్ వైర్లను తాకి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్నేహితులు విషయాన్ని కుటుంబీకులు, పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. పొలం యజమానిపై చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు కోరారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు పొలం యజమాని మల్లేషంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వజన్ తెలిపారు.



చంద్రయ్య(ఫైల్)

రాష్ట్రంలో ఉద్యోగ భద్రత కరువు: అశోక్‌గౌడ్

షాద్‌నగర్ రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో ఉద్యోగ భద్రత కరువైందని బీసీ సంఘం దక్షిణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం అశోక్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు శుక్రవారం ఆయన మద్దతు ప్రకటించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9వేల మంది జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టారని అన్నారు. వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం నేతలు రాములు గౌడ్, మేడిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

పంచాయతీ జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కే భూపాలాచారి, జిల్లా అధికార ప్రతినిధి కే వెంకటేష్ గుప్తా డిమాండ్ చేశారు. జేపీఎస్, ఓపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమ్మె బాట పట్టడంతో పాలన పడకేసిందన్నారు. వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్, రఘు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

సీపీఓ నిరంజన్



ధాన్యాన్ని తూకం వేస్తున్న సీపీఓ నిరంజన్

కొడంగల్: మండల పరిధిలోని నాగారం గ్రామంలో ఊరడి చిన్న నర్సింహులు, ఊరడి నడిపి నర్సింహులు పొలంలో పంటకోత పద్ధతిని జిల్లా సీపీఓ (ముఖ్య ప్రణాళిక అధికారి) నిరంజన్ శుక్రవారం పరిశీలించారు. ఈ పద్ధతిలో పంట దిగుబడి అంచనా వేయవచ్చని అన్నారు. ఐదున్నర మీటర్ల ప్లాట్ ఏరియాలో జరిగిన ప్రయోగంలో ఒక్కో పొలంలో ఒక్కో రకంగా తూకం వస్తుందన్నారు. మేలైన దిగుబడుల కోసం నేల అనుకూలతలను బట్టి వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి సరైన రకాలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో తాండూరు డివిజన్ ఉప గణాంకాధికారి రాములు, కొడంగల్ మండల ప్రణాళిక గణాంకాధికారి రాజేందర్‌రెడ్డి, వీఆర్‌పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు ప్రాధాన్యత

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రైతు కుటుంబాలకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కులకచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మినీ ఫంక్షన్ హాల్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వారి ఇళ్ల వద్ద స్థలం లేక ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి వారి కోసం మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం మక్త వెంకటాపూర్‌లో సేవాలాల్ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు.



కుల్కచర్లలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి

వ్యక్తి అదృశ్యం

కద్లాల్: నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన వివరాలు.. కద్లాల్‌కు చెందిన వీ శ్రీకాంత్(50) ఈ నెల 9న హైదరాబాద్‌కు బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఆచూకీ లభించలేదు. శ్రీకాంత్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



శ్రీకాంత్(ఫైల్)

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- ముఠాగా ఏర్పడిన రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాలకు చెందిన వ్యక్తులు
- నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- 30తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ నారాయణరెడ్డి



చోరీలకు పాల్పడిన నిందితులు



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

షాద్‌నగర్ రూరల్: తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్.. పగలు రెక్కీ.. రాత్రి ఆ ఇంటికి కన్నం వేస్తారు.. ఈ ముఠా పట్టణంలో వరుస చోరీలకు పాల్పడుతూ అందినకాడికి దోచుకెళుతోంది. నిఘా పెట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం దేవునిఎర్రవల్లికి చెందిన ఎం రాఘవేందర్‌రెడ్డి అలియాస్ రాజు, అలియాస్ రఘు, వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం, పోచమ్మగుట్ట తండాకు చెందిన మోతీరాం, వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం, రేమద్దుల గ్రామానికి చెందిన చందు ఓ ముఠాగా ఏర్పడ్డారు. షాద్‌నగర్ పట్టణంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఏప్రిల్ 18న పట్టణంలోని విజయనగర్ కాలనీకి చెందిన నరేష్‌కుమార్ ఇంటికి తాళం వేసి నైట్ డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం తిరిగి రాగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి 20 తులాల బంగారు, 13 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ పర్యవేక్షణలో షాద్‌నగర్ పోలీసులు, శంషాబాద్ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాఘవేందర్‌రెడ్డి, మోతీరాం, చందును అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల విషయం ఒప్పుకున్నారు. ఏడాది నుంచి షాద్‌నగర్ పరిధిలో 08, చేవెళ్లలో 03, మొయినాబాద్‌లో 02, మైలార్‌దేవ్‌పల్లి 01, వనపర్తి జిల్లా పాన్‌గల్‌లోని ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. నిందితుడు రాఘవేందర్‌రెడ్డి వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో 59 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు కేసులకు సంబంధించి 20తులాల బంగారు నగలు, 50 తులాల వెండి ఆభరణాలు, ఇతర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు సంబంధించి 10తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో పట్టణ సీఐ నవీన్‌కుమార్, డీఐ భరత్‌కుమార్, శంషాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీరబాబుతో పాటు సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ వారిని అభినందించారు.

నిరుపేదలకు అండ.. సీఎంఆర్‌ఎఫ్



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిని కిష్టయ్యకు అనారోగ్యానికి గురి కావడంతో సీఎంఆర్‌ఎఫ్ కింది రూ. 1.5లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నియోజకవర్గంలోని ఎంతో మంది పేదలు లబ్ధిపొందారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంకటయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.